క్లుప్తంగా

బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ నేడు

అద్దంకి రూరల్: అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి పానెం చిన హనిమిరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం నియోజకవర్గంలోని సంతమాగులూరులో, అద్దంకిలో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ విస్తృత స్థాయి సమావేశాలు నిర్వహించనున్నట్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు సంతమాగులూరు అడ్డరోడ్డులోని వాసవి కళ్యాణ మండపంలో, మధ్యాహ్నం 2 గంటలకు అద్దంకి వైఎస్సార్ సీపీ పార్టీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

ఎస్‌టీఓకు ఘన సన్మానం


ఎస్‌టీవోను సన్మానిస్తున్న పుట్టంరాజు తదితరులు

అద్దంకి: స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా కలెక్టర్ జె. వెంకటమురళి చేతుల మీదుగా అద్దంకి ఎస్‌టీఓ యస్‌కే అబ్దుల్ ఖాదర్ భాషా ఉత్తమసేవా పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ విశ్రాంత ఉద్యోగుల సంఘం-బాపట్ల జిల్లా-2 కోశాధికారి పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి మంగళవారం ఖాదర్ బాషాను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వి. సునీత, కె. శ్రీనివాస్, బి. శ్రీనివాస్ తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు.

బాపట్ల జిల్లాకు దుగ్గిరాల పేరు పెట్టాలి


చీరాల: బాపట్ల జిల్లాకు దుగ్గిరాల గోపాలకృష్ణయ్య పేరు పెట్టాలనే ప్రజల కోరిక సమంజసమేనని మాజీ ఎంపీ చిమటా సాంబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. చీరాల-పేరాల ఉద్యమానికి జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చిన వ్యక్తి దుగ్గిరాల గోపాలకృష్ణయ్య అని, ఆయన పేరును బాపట్ల జిల్లాకు పెట్టాలని ఆయన కోరారు. త్వరలో ముఖ్యమంత్రిని కలిసి వినతిపత్రం అందించనున్నట్లు తెలిపారు.

ఫొటో గ్రాఫర్లకు సన్మానం


మార్టూరు ఫొటోగ్రాఫర్లను సన్మానిస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

మార్టూరు: ఫొటో గ్రఫీ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రం మార్టూరులో మంగళవారం ఫొటోగ్రాఫర్లను ఘనంగా సన్మానించారు. మార్టూరు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మార్టూరుకు చెందిన ఫొటోగ్రాఫర్లు పోలూరు సింగయ్య, భీమవరపు సుబ్బారావు, పులిపాటి సుబ్బారావు, దేవరపల్లి శివకుమార్, షేక్ నాసర్ వలిలను శాలువాలతో ఘనంగా సత్కరించి సన్మానించి స్వీట్ బాక్సులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్టూరు రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మాదాల సాంబశివరావు, చెరుకూరు నాగేశ్వరరావు ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

మాధవస్వామికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో మాధవస్వామి వారు

కారంచేడు: మండల కేంద్రమైన కారంచేడులో కొలువైన శ్రీమాధవ స్వామివారి దేవాలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం స్వామి వారికి భక్తులు విశేష పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు. శ్రామణమాసం ఆఖరి మంగళవారం ఏకాదశిని పురస్కరించుకొని స్వామివారికి విశేష పూజలతో పాటు, క్షీరాభిషేకాలు నిర్వహించారు. సహస్రనామార్చనలు నిర్వహించి, అర్ధ ఏకాహం, హరే రామ నామ సంకీర్తనలు నిర్వహించారు.

పొదుపు రుణాలు సకాలంలో చెల్లించాలి

చీరాల టౌన్: బ్యాంకు లింకేజీ రుణాలు తీసుకున్న పొదుపు గ్రూపులు రుణాల చెల్లింపులు సకాలంలో చెల్లించేలా వీఓఏలు చర్యలు తీసుకోవాలని ఏపీఎం మధుసూదనరావు సూచించారు. మంగళవారం బుర్లవారిపాలెంలోని వెలుగు కార్యాలయంలో మండలంలోని వీఓఏలకు సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ మండలంలో ఉన్న పొదుపు గ్రూపుల వద్దకు వీఓఏలు నెలకు ఒకసారి సమావేశాన్ని నిర్వహించి గ్రూపుల ప్రగతిని తెలుసుకోవాలన్నారు. పొదుపు గ్రూపులు తీసుకున్న రుణాలు, ఏర్పాటు చేసుకున్న స్వయం సహాయక సంస్థలు, వ్యాపారాలను వీఓఏలు పరిశీలించి పొదుపు మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ సంఘాల పుస్తకాలను విధిగా రాయడంతో పాటు సీఐఎఫ్, స్త్రీనిధి, సబ్‌ప్లాన్ రుణాలన్నీ వందశాతం సక్రమంగా చెల్లింపులు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

మూగ జీవాల ఆవేదన


శిథిలావస్థకు చేరిన పశువైద్యశాల భవనం


ప్రారంభానికి ముందే శిథిలావస్థకు చేరిన నూతన భవనం

- శిథిలావస్థలో పశు వైద్యశాల
- ఇన్‌చార్జులతోనే పశువైద్యం
- కొత్త భవనం నిర్మించినా ప్రారంభానికి ముందే శిథిలం
- మండలానికి ఒక్కటే దిక్కు

అద్దంకి: మండలంలోని బొమ్మనంపాడు గ్రామంలో యాభై ఏళ్లక్రితం నిర్మించిన పశు వైద్యశాల శిథిలావస్థకు చేరింది. దానికి తోడు ఇక్కడ పశువైద్యుడు, అసిస్టెంట్ ఇద్దరూ లేరు. దీంతో పశువైద్యం సక్రమంగా అందక పశు పోషకులు ఇబ్బందులు పడుతున్నారు. వివరాలు.. మండలంలో 26 గ్రామాలున్నాయి. అందులో గొర్రెలు, మేకలు, గేదెలు, ఆవులతో కలుపుకుని 2లక్షలు ఉన్నాయి. 50 సంవత్సరాల క్రితం బొమ్మనంపాడు గ్రామంలో పశు వైద్యశాలను పెంకు భవంతిలో ఏర్పాటు చేశారు. అది ఇప్పుడు పై కప్పు వర్షానికి కారడంతో అందులో మందులను నిల్వ చేయడానికి వీలు లేకుండా పోతోంది. ఇక్కడ ఒక పశు వైద్యుడు, ఒక అసిస్టెంటు ఉండాల్సి ఉంది. ఇటీవల ఇద్దరూ వేరే చోటికి బదిలీ అయ్యారు. దీంతో మేదరమెట్ల వైద్యశాలకు చెందిన పశు వైద్యుడిని ఇన్‌చార్జిగా నియమించారు. దీంతో ఆయనకు రెండు డ్యూటీలు కావడంతో ప్రస్తుతం వైద్యశాలలో ఒక గోపాల మిత్ర, ఒక ఏహెచ్ వంతున డ్యూటీలు నిర్వహిస్తున్నారు. గతం నుంచి ఇక్కడ పశువైద్యుడు సెలవులో వెళ్లడం వంటి కారణాలతో ఎప్పుడూ పర్మినెంటు పశువైద్యుడు లేక పశుపోషకులు నానా అవస్థలు పడుతున్నారు.

ఒకే ఒక వైద్యశాల..

మండలంలోని 26 గ్రామాలకు ఒకే ఒక వైద్యశాల కావడంతో, అదీ ఒక మూలన విసిరేసినట్లు ఉండటంతో, మిగిలిన గ్రామాల్లోని పశువులకు వైద్య సేవలు అందడం లేదు. ఏహెచ్‌లు సరిపడిన సంఖ్యలో లేకపోవడం, పూర్తి స్థాయి వైద్యులు కాకపోవడంతో పశువులకు వ్యాధులు వచ్చినా.. సమయంలో పశువైద్యుడు అందుబాటులో లేక, ప్రైవేటు వైద్యులను ఆశ్రయించి జేబులు ఖాళీ చేసుకుంటున్నారు.

ప్రాంభానికి ముందే శిథిలం

ఇదే గ్రామంలో గ్రామ సచివాలయానికి సమీపంలో ఒక నూతన పశు వైద్యశాలను నిర్మించినా ఆ భవనం ప్రారంభానికి నోచుకోలేదు. ప్రస్తుతం దానికి పెట్టిన తలుపులు, కిటికీలు, దర్వాజాలు ఎవరో ఎత్తుకెళ్లారు. దీంతో నూతన భవనం లేక, పాత భవంతి కారుతుండటంతో ఏం చేయాలో దిక్కు తోచని స్థితిలో పశువైద్యులు కాలం వెళ్లదీస్తున్నారు.

> **అద్దంకి వెళ్లాల్సి వస్తోంది**
>
> పశువుకు ఇబ్బంది కలిగితే అద్దంకి వైద్యశాలకు వెవెళ్లాల్సి వస్తోంది. చిన్నవి అయితేనే గోపాలమిత్రలు, ఏహెచ్‌లు చేయగలుగుతున్నారు. బొమ్మనంపాడు వైద్యశాల చాలా దూరం. మరో రెండు వైద్యశాలలు మంజూరు చేస్తే బాగుంటుంది.
>
> – ఏ. రాంబాబు, పశు పోషకుడు

మహిళలకు రక్షణ కవచం శక్తి యాప్


విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న చీరాల డివిజన్ శక్తి బృందం

చినగంజాం: మహిళలకు శక్తి యాప్ రక్షణ కవచం లాంటిదని చినగంజాం ఎస్ఐ శీలం రమేష్ అన్నారు. మంగళవారం మోటుపల్లి పంచాయతీ అడివీధిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గుడ్ టచ్ బ్యాడ్ టచ్, శక్తి యాప్ గురించి చీరాల సబ్ డివిజన్ శక్తి బృందం విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాల మేరకు చీరాల డీఎస్పీ మొయిన్ సూచనలతో చీరాల శక్తి బృందం ఎస్ఐ ఏ హరిబాబు ఆధ్వర్యంలో విద్యార్థులకు శక్తి యాప్, గుడ్‌టచ్ బ్యాడ్ టచ్ మహిళా సంబంధిత నేరాలు, బాల్య వివాహాలు వలన కలిగే అనర్థాలు, సైబర్ నేరాల గురించి, ఇన్ స్టాం గ్రామ్ వలక కలిగే అనర్థాల గురించి అవగాహన కల్పించారు. ఎస్ఐ రమేష్ మాట్లాడుతూ శక్తి యాప్ మహిళలకు రక్షణ కవచం లాంటిదని జిల్లాలోని ప్రతి మహిళ మొబైల్‌లో యాప్‌ను నిక్షిప్తం చేసుకోవాలనే ఉద్దేశంతో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శక్తి బృందం ఎస్ఐ హరిబాబు మాట్లాడుతూ ఏదైనా అనుకోని ఆపద వచ్చినప్పుడు పోలీసుల తక్షణ రక్షణ పొందడానికి యాప్ ఉపయోగ పడుతుందన్నారు. పోలీస్ సేవలను మహిళలకు చేరువ చేసేందుకు శక్తి వాట్సాప్ నంబర్ 7993485111 ను అందుబాటులో తీసుకువచ్చారన్నారు. మెసేజ్ చేయడం ద్వారా శక్తి బృందం మహిళ వద్దకు చేరుకొని సహాయం అందిస్తారని అన్నారు. మహిళా సంబంధిత నేరాలు, బాల్యవివాహాలు వలన కలిగే అనర్థాలు, సైబర్ నేరాలు గురించి వివరించారు. అత్యవసర పరిస్థితులలో ఉపయోగించాల్సిన నంబర్లు100/112,1098,181, 1930,1972 ల గురించి అవగాహన కల్పించారు. హెచ్‌ఎం సోమయ్య, శక్తి బృందం సభ్యులు సుబ్బారావు, సునీత, ధనలక్ష్మి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి

అద్దంకి రూరల్: వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసుకునేవారు పోలీస్ అనుమతులు తప్పనిసరిగా పొందాలని సీఐ సుబ్బరాజు మంగళవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. వినాయక మందిరాల్లో మైకెసెట్, ఎలక్ట్రిసిటీ ఉపయోగించుకునేందుకు అనుమతులు పొందాలన్నారు. విగ్రహం ఏర్పాటు చేసే కమిటీ మెంబర్లు పూర్తి సమాచారం ముందుగా తెలియజేయాలన్నారు. స్టేషన్‌లో పూర్తి సమాచారం లిఖిత పూర్వకంగా అందించాలన్నారు. విగ్రహం ఏర్పాటు చేసే ప్రాంతంలో సీసీ కెమెరాలు చేయాలని సూచించారు. ఏ వార్డు, ఏగ్రామంలో విగ్రహం ఏర్పాటు చేస్తారో ఆదే గ్రామానికి చెందిన మహిళా పోలీస్‌కు పూర్తి సమాచారం ఇవ్వాలన్నారు. నిమజ్జనం రోజు డీజే సౌండ్‌లు పెట్టి మద్యం సేవించి గొడవలకు కారకులైన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అద్దంకిరూరల్: అద్దంకి పట్టణంలో కొత్తగా నిర్మించుకున్న విద్యుత్ టవర్ లైన్ పనుల కారణంగా స్థానిక భవాని సెంటర్ వినాయక స్వామి గుడి నుంచి కమతేశ్వరస్వామి గుడి వరకు రోడ్డుకు రెండు వైపులా, కాకాని పాలెం చుట్టుపక్కల ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదు. బుధవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటలవరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనున్నట్లు మంగళవారం జేఈ దామోదరం తెలిపారు.

శింగరకొండ దర్శిని

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం శ్రావణ మాసం పునర్వసు నక్షత్రం ద్వాదశి సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు మంగళవారం తెలిపారు. ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

శ్రావణ శుక్రవార వ్రతాలకు ఏర్పాట్లు

అద్దంకి: మండలంలోని సింగరకొండ గ్రామంలోని సింగరకొండపై వేంచేసి ఉన్న శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో శుక్రవారం సందర్భంగా శ్రావణ శుక్రవార వ్రతాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు, ఈఓ మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. శ్రావణ మాసం సందర్భంగా శుక్రవారం మహిళలకు ప్రీతి కరమైన వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 9:00 గంటలకు దేవస్థానం వద్దకు రావాలని కోరారు. పూజా సామగ్రి దేవస్థానం వారు ఏర్పాటు చేస్తామని, కలశానికి చెంబు మాత్రం వెంట తీసుకువస్తే సరిపోతుందని తెలిపారు.

బలవంతపు వసూళ్లు చేస్తే చర్యలు


మాట్లాడుతున్న ఎస్సై వినోద్‌బాబు, తహసీల్దార్ సింగారావు

జె.పంగులూరు: మైక్రో ఫైనాన్స్ ఉద్యోగులు గ్రామాల్లో డబ్బు వసులు చేసేందుకు ఇష్టానురీతిగా ప్రవర్తించడం, ఆడవారిపై దురుసుగా ప్రవర్తించడం, ఇంటికి తాళం వేయడం వంటి పనులు చేస్తే చర్యలు తీసుకుంటాని పంగులూరు ఎస్సై వినోద్ బాబు, తహసీల్దార్ సింగారావు హెచ్చరించారు. మంగళవారం మండలంలో లోన్లు ఇచ్చిన ఫైనాన్స్ సంస్థల ప్రతినిధులతో మాట్లాడారు. ఈ మధ్య కాలంలో గ్రామాల్లో ఫైనాన్స్ వారి ఆగడాలు ఎక్కువయ్యాయని.. గ్రామాల్లో విచ్చలవిడిగా లోన్లు ఇవ్వడం, ఒకే వ్యక్తికి అనేక మైక్రో కంపెనీలు లోన్లు ఇస్తున్నాయన్నారు. అయితే లోన్లు తిరిగి కట్టకపోతే వారి ఇంటి వద్దకు వెళ్ళి ఇంటిలో ఉన్న ఆడవారిని సైతం బయటకు లాగి ఇంటికి సీల్ వేస్తున్నారన్నారు. లోను రికవరీలో భాగంగా చేతికి ఏది దొరికితే అంది తీసుకుపోతున్నారు.

నామ్స్ ప్రకారమే లోను రికవరీ ఉండాలి

మైక్రో ఫైనాన్ వారు ఇస్టాను సారంగా డబ్బులు వసూలు చేయడానికి వీలు లేదన్నారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు మాత్రమే వసూళ్లు ఉండాలి. ఆడవారిపై దురుసుగా ప్రవర్తించడం, ఇస్టాను సారంగా మాట్లాడటం వంటివి మా దృష్టికి వస్తే ఊరుకునేది లేదన్నారు. అలాంటి వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కిస్తీ కట్టడం ఒక రోజు లేటు అయితే వారి వద్ద రూ. 1000 పెనాల్టి వసూలు చేస్తే చర్యలు తప్పవన్నారు. ఒక నెల కిస్తీ కట్టకుంటే వారి ఇంటికి సీలు వేసి గోడలపై వారి ఇస్టాను సారంగా రాయడం మంచిది కాదన్నారు.

డబ్బు అందకుంటే గ్రీవెన్స్‌కు రండి


జరుబులవారిపాలెంలో రైతులతో మాట్లాడుతున్న ఏఓ నాగరాజు

కారంచేడు: అర్హులైన అన్నదాతలకు అన్నదాత సుఖీభవ డబ్బులు జమ కాకుంటే మీ సమీప రైతు సేవా కేంద్రంలోని గ్రీవెన్స్ సెల్‌లో అర్జీలు పెట్టుకోవాలని వ్యవసాయాధికారి ఎం. నాగరాజు అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని జరుబులవారి పాలెం రైతు సేవా కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 2025-2026 సంవత్సరానికి గాను మండలంలోని ఏ గ్రామంలోనూ వైట్ బర్లీ, బ్లాక్ బర్లీలను సాగు చేయవద్దని తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఉన్నతాధికారులు ఈ సూచనలు చేశారన్నారు. ఒక వేళ సాగు చేస్తే తహసీల్దారు, పోలీస్ వారి సహకారంతో ఆ పంటలను దున్ని వేస్తామన్నారు. మండలంలో యూరియా, డీఏపీలు అందుబాటులో ఉన్నాయన్నారు. అవసరమైన రైతులు వినియోగించుకోవాలని సూచించారు. అధిక ధరలకు విక్రయిస్తే దుకాణాల లైసెన్స్‌లను రద్దు చేస్తామని హెచ్చరించారు.

యాజమాన్య పద్ధతులతో లాభాలు

చినగంజాం: వేరుశనగ పంట సాగు చేస్తున్న రైతులు సంబంధిత యాజమాన్య పద్ధతులు గురించి క్షుణ్ణంగా తెలుసుకోవాలని ఏరువాక శాస్త్రవేత్త మురళీధర్ నాయక్ అన్నారు. మండలంలోని పెదగంజాం రైతు సేవా కేంద్రం పరిధిలోని పెద్ద గొల్లపాలెం గ్రామంలో జాతీయ ఆహార నూనెల మిషన్ నూనె గింజలు పథకంలో వేరుశనగ పంట రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి ఆర్. చంద్రశేఖర్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఏరువాక శాస్త్ర వేత్త మురళీధర్ నాయక్, ఏడీఏ రత్నకుమారి పాల్గొన్నారు. మండల వ్యవసాయాధికారి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఇంకొల్లు(చినగంజాం): పొగాకు పంటకు ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు దృష్టి సారించాలని పర్చూరు డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు పి. ప్రవీణ సూచించారు. మండలంలోని కొణికి గ్రామంలో మంగళవారం ఆత్మ ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి ఎస్. మేరిమ్మ, కొణికి గ్రామ వ్యవసాయ సహాయకులు జె. జమీమా, ఆత్మ ఏటీఎం హారిక, పర్చూరు వ్యవసాయ విస్తరణాధికారి రాధ పాల్గొన్నారు.

చీరాల రూరల్: ప్రభుత్వం అందజేస్తున్న అన్నదాత సుఖీభవ పథకం పొందని రైతులు గ్రామ వ్యవసాయ సహాయకుల వద్దకువెళ్లి తమ పేర్లు గ్రీవెన్స్‌లో నమోదుచేసుకోవాలని మండల వ్యవసాయాధికారి పి. నిర్మలాదేవి సూచించారు. మంగళవారం చీరాల నగర్, కొత్తపాలెం పంచాయతీల్లో మాట్లాడారు. వీఏఏ మనీష, రైతులు పాల్గొన్నారు.

అద్దంకి రూరల: మొక్కజొన్నలో ఇనుపధాతు లోపాన్ని నివారించుకోవాలని కేంద్రం వ్యవసాయాధికారి సరళ అన్నారు. మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం మండలంలోని వెంపరాల, చక్రాయపాలెం గ్రామాల్లో నిర్వహించారు. ఉద్యాన అధికారి దీప్తి వ్యవసాయసహాయకులు ప్రసన్న శివాని తదితరులు పాల్గొన్నారు.

నీటితీరువా వసూళ్లు వేగవంతం చేయండి

చీరాల టౌన్: గ్రామాల్లో ఉన్న పంట పొలాలకు సంబంధించిన నీటి తీరువా వసూళ్లను నెలాఖరు కల్లా పూర్తి చేయడంతో పాటుగా ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను నిర్ణీత సమయంలోగా విచారించి పరిష్కరించాలని తహసీల్దార్ కుర్రా గోపీకృష్ణ సూచించారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో గ్రామ, పట్టణ రెవెన్యూ అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. గ్రామాలు, సచివాలయాల పరిధిలో పెండింగ్‌లో ఉన్న అర్జీలపై సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో ఉన్న వ్యవసాయ భూములకు సంబంధించి నీటి తీరువా వసూళ్ల లక్ష్యంగా గ్రామ రెవెన్యూ అధికారులు పనులు చేయాలని కోరారు. వీఆర్వోలు సక్రమంగా వసూళ్లు చేసి నగదును బ్యాంకులో జమ చేయాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను త్వరగా పరిష్కరించాలని కోరారు. రెవెన్యూ ఉద్యోగులు, సిబ్బంది విధులను సక్రమంగా నిర్వహించాలన్నారు. విధుల్లో అలసత్వం వహించిన వారిపై శాఖా పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ సుశీల, మండల సర్వేయర్ బసవాచారి, వీఆర్వోలున్నారు.


అమ్మకానికి సిద్ధంగా వినాయక విగ్రహాలు


రామ మందిరంలో వినాయకుడు

ఉత్సవాలకు ముస్తాబైన గణనాథులు


చిట్టి వినాయక విగ్రహాలు


సూర్యవాహనంపై వినాయకుడు


గదా ధారుడైన వినాయకుడు

అద్దంకి రూరల్: వినాయక చవితి పండగకు భక్తులు ఏర్పాటు చేసే మందిరాల్లో కొలువు దీరేందుకు గణనాథులు ముస్తాబయ్యారు. అద్దంకిలో వినాయక చవితి వేడుకలు భక్తులు మందిరాలు ఏర్పాటు చేసి వైభవంగా నిర్వహిస్తుంటారు. మండలంలోని గ్రామాల్లో భారీ విగ్రహాలు ఏర్పాటుచేసి నవరాత్రులు నిర్వహించి, నిమజ్జనానికి భారీ సెట్టింగ్‌లతో అద్దంకి తీసుకువచ్చి నిమజ్జనం చేస్తారు. అద్దంకిలో విగ్రహాలను బీహార్‌కు చెందిన కళాకారులు రూపొందించి అమ్మకానికి సిద్ధంగా ఉంచారు. ఇప్పటికే ఉత్సవ నిర్వాహకులు విగ్రహాల కొనుగోలు దారులు అడ్వాన్స్‌లు చెల్లించి వెళుతున్నారు. వివిధ అలంకారాల్లో గణేషుని విగ్రహాలు చూపరులను ఇట్టే ఆకట్టుకుంటున్నాయి.

కరెన్సీ నోట్లతో అమ్మవారి అలంకరణ


కరెన్సీ నోట్లతో ముస్తాబైన అమ్మవారు

ఒంగోలు మెట్రో: నగరంలోని గాంధీరోడ్ కన్యకాపరమేశ్వరి వీధిలో వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో మంగళవారం వాసవి కన్యకాపరమేశ్వరిని ఎనిమిది లక్షల ఎనభై ఎనిమిది వేల ఎనిమిది వందల ఎనభై ఎనిమిది రూపాయలతో సర్వాంగ సుందరంగా ధనలక్ష్మిగా అలకరించారు. ఆలయ తదియారాధన సంఘం సభ్యులు మాట్లాడుతూ శ్రావణ మాసంలో ప్రతి మంగళ, శుక్రవారాల్లో ప్రత్యేకంగా వాసవీ మాతను అలంకరించి వరలక్ష్మి దేవిగా సామూహిక కుంకుమార్చనలు ఆలయ అర్చకులు శర్మ, ఫణిశర్మలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్థానిక మహిళలు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు అందుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.